ప్రజాశక్తి
మంగళవారం 27 జూన్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఖరీఫ్ సాగుకు ఆచితూచి



- వర్షాలు ఆశాజనకంగా ఉన్న ప్రాంతాల్లో సేద్యపు పనులు
- పల్నాడులో నిరాశాజనకం, గుంటూరులో ఆశాజనకం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నైరుతీ రుతుపవనాల ప్రభావంతో 10 రోజుల కిందట గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రారంభమైన వర్షాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. గుంటూరు జిల్లాలో వర్షపాతం ఆశాజనకంగా ఉన్నా పల్నాడు జిల్లాలోని కొన్ని మండలాల్లో సరిగాలేదు. గుంటూరు జిల్లాలోని 18 మండలాలకు గాను 11 మండలాల్లో అవసరానికి మించి వర్షపాతం నమోదైంది. జిల్లాలో జూన్ నెల మొత్తం 97.1 మిల్లీ మీటర్లవర్షం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 114.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మేడికొండూరులో అత్యధికంగా 204.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా తెనాలిలో 202.4 మిల్లీమీటర్లు నమోదైంది. పొన్నూరు, వట్టిచెరుకూరు, పెదకాకానిలో సాధారణ వర్షపాతం నమోదు కాగా తాడికొండ, తాడేపల్లి, తుళ్లూరు, మంగళగిరిలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

పల్నాడు జిల్లాలో మొత్తం 28 మండలాలకు గాను 10 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా మిగతా వాటిల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షం కురిసింది. పల్నాడు జిల్లాలో జూన్ నెలలో 80.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 80.8 మిల్లీ మీటర్లు నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. సత్తెనపల్లిలో అత్యధికంగా 192.4, తరువాత యడ్లపాడులో156.4 మిల్లీ మీటర్ల వర్షం కురవగా మరో 8 మండలాల్లో 100 మిల్లీ మీటర్ల కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైంది. మిగతా 2లో



చిలకలూరిపేట రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

కేంద్ర, రాష్ట్రం కలిసి భారాల బాదుడు

- విద్యుత్ ఛార్జీలపై వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఆగ్రహం
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సమావేశాలు, నిరసనలు
- భవిష్యత్‌లోనూ పోరాటాలకు కలిసి రావాలని ప్రజలకు పిలుపు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలు వేస్తున్నాయని వివిధ పార్టీల నాయకులు విమర్శించారు. విద్యుత్ భారాలపై స్థానిక పండరిపురంలోని ఏలూరు సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ఎప్పుడో 2014-19 మధ్య 2లో



పెనుమాకలో విద్యుత్ బిల్లుల దహనం

జిజిహెచ్‌లో గుండె ఆపరేషన్లు పున:ప్రారంభం

ఒకరికి విజయవంతంగా ఓపెన్ హార్ట్ సర్జరీ చేసిన డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే 2 లో



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఫీజుల దోపిడీపై ఎస్ఎఫ్ఐ ధర్నా

- విద్యాసంస్థల్లో తనిఖీ కోసం డిఇఒకు వినతి
- నివేదించాలని ఎంఇఒలకు శామ్యూల్ ఆదేశం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లాకరస్పాండెంట్

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో విద్యాశాఖాధికారులు తనిఖీలు చేసి నిబంధనలు పాటించని పాఠశాలలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక మోర్ సెంటర్‌లోని జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్ష 2లో

డ్రగ్స్ జోలికెళ్తే జీవితం నాశనమే

విద్యార్థులకు పల్నాడు కలెక్టర్, ఎస్పీ ఉద్బోధ 2 లో

పోలవరం నిర్వాసితులకు వెల్లువెత్తిన సంఘీభావం

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా విలేకర్లు

ఆంధ్ర రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం 120 గ్రామాల గిరిజన ప్రజలు తమ ఇళ్లు, లక్ష ఎకరాల పంట పొలాలు త్యాగం చేసినా వారికి పరిహారం ఇవ్వటంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని సిపిఎం గుంటూరు, పల్నాడు జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, గుంటూరు విజయ్‌కుమార్ విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని కోరుతూ చేపట్టిన పాదయాత్రకు సంఘీబావంగా గుంటూరు పల్నాడు జిల్లాల్లో సోమవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా గుంటూరులోని

సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

బ్రాడీపేట, అరండల్‌పేట, శంకర్ విలాస్ సెంటర్‌లో ప్రజలు, షాపుల నుంచి విరాళాలను సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సేకరించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయం నుండి పల్నాడు రోడ్డులో కొన్ని దుకాణాల్లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా రామారావు, విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందుగా నిర్వాసితులు అవుతున్న ప్రజానీకానికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం చెల్లించాలని చట్టంలో స్పష్టంగా ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి ఎలాంటి సహాయమూ చేయలేదన్నారు. గత ఆగస్టులో సంభవించిన వరదల కారణంగా పోలవరం నిర్వాసిత గిరిజన ప్రజానీకం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ నిర్వాసితులు సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుండి జూలై 4వ తేదీ వరకు పాదయాత్ర నిర్వహిస్తూ విజయవాడకు చేరుకుంటారని, ఆ సందర్భంగా విజయవాడ ధర్నాచౌక్‌లో బహిరంగ సభ జరుగుతుందని, సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పాల్గొంటున్నారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకం కోసం తమ సొంత 2లో





గుంటూరు, నరసరావుపేటలో విరాళాలు సేకరణలో పాశం రామారావు, గుంటూరు విజయ్‌కుమార్, ఇతర నాయకులు, కార్యకర్తలు



పోలవరం నిర్వాసితులకు వెల్లువెత్తిన సంఘీభావం

(మొదటి పేజీ తరువాయి)

గూడును, పొలాలను త్యాగం చేసిన గిరిజనులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. గుంటూరులో సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, నాయకులు ఎం.ఎ.చిష్టి, బి.ముత్యాల రావు, కె.శ్రీనివాసరావు, ఆది నికల్సన్, షేక్ ఖాసిం షహీద్, సాంబశివరావు, షేక్ ఖాశీం వలి, ఎ.కల్యాణి, నరసరావుపేటలో కె.హనుమంతరెడ్డి, జి.మల్లేశ్వరి, ఎస్.ఆంజనేయ నాయక్, షేక్ సిలార్ మసూద్, కె.సాయికుమార్, రాజు, షేక్ మస్తాన్‌వలి, ఎం.ఆంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో సిపిఎం నాయకులు విరాళాలు సేకరించారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. వందలాది మంది పాల్గొంటున్న ఈ పాదయాత్రకు ప్రజలు అండగా నిల వాలని కోరారు. నాయకులు వై.కేశవరావు, జొన్నా శివశంకర రావు, డి.శ్రీనివాసకుమారి, బి.వెంకటేశ్వర్లు, ఎస్.ముత్యాలరావు, లక్ష్మణరావు, సిహెచ్.శ్రీరామ్, కె.సాంబశివరావు, ఎమ్‌డి బాజ్జీ, బి.కృష్ణ, ఎల్.ఆచారి, కె.మేరి, కె.వెంకటయ్య పాల్గొన్నారు. కుంచనపల్లి ప్రాతూరు రోడ్డు వద్ద సిపిఎం తాడేపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావ కార్యక్రమం సిపిఎం మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడారు. నాయకులు ఎ.రంగారావు, పి.కృష్ణ, ఎ.రామారావు, ఎం.పాములు, పి.సుబ్బారావు, కె.స్వాతి, ఎస్.రవి కిషోర్, వి.బెనర్జీ, హను మంతరావు, కె.శ్రీనివాసరావు, జి.శంకర్రావు, బి.ఏలియా పాల్గొ న్నారు. దుగ్గి రాల మండలం చిలువూరులో సిపిఎం ఆధ్వ



ర్యంలో నిధి వసూలు చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడారు. మండల కార్యదర్శి జెట్టి బాలరాజు నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, జి.బాల చంద్రుడు, ఎం.కోటేశ్వరరావు, కె.దావీదు పాల్గొన్నారు.



ఫీజుల దోపిడీపై ఎస్ఎఫ్ఐ ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శులు కోటా సాయికుమార్, ఎస్.రాజు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు సొంతంగా ముద్రించిన పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నాయని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యా కానుక కిట్లు అందించాలని, ప్రతి ఒక్కరికీ అమ్మఒడిని వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయా సమస్యలపై డిఇఒ స్పందిస్తూ ఎంఇఒలతో మాట్లాడి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నవితా, రమా, అమూల్య, జిల్లా కమిటీ సభ్యులు జ్యోతిష్, రాఘవ, సిద్ధు పాల్గొన్నారు.

డ్రగ్స్ జోలికెళ్తే జీవితం నాశనమే

- **విద్యార్థులకు పల్నాడు కలెక్టర్, ఎస్పీ ఉద్బోధ**

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్

దేశ భవిష్యత్ యువత మీద ఆధారపడి ఉందని మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా విద్యార్థులు అప్ర మత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సూచించారు. సోమవారం 'అంత ర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా స్థానిక కోటప్పకొండ రోడ్డులోని నరసరావుపేట ఇంజి నీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 144 దేశాలలో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. మెట్రో పాలిటన్ నగరాలు, పట్టణాలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుందని ఆందోళన వెలిబుచ్చారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని, సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ కొంతమంది కొత్త పరిచయాల ద్వారా డ్రగ్స్ సేవించడం మొదలు పెడతారని, తర్వాత వాటికి బానిసలై చోరీలు, ఇతర నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. సమాజాన్ని నిర్వీర్యం చేసే డ్రగ్స్‌ను ఏ రూపంలో ఉన్నా వాటిని తుదముట్టించాలన్నారు. డ్రగ్స్‌ను వాడి ఉజ్వల భవిష్యత్తును పాడు చేసుకోవద్దని చెప్పారు. మాదక ద్రవ్యాలు వినియోగించే వారికి కఠిన శిక్షలు ఉంటా యన్నారు. విద్యాసంస్థల వద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేసి డ్రగ్స్ అనర్థాలపై చైతన్యం తెస్తున్నామని, ప్రత్యేక ప్రణా ళికలతో డ్రగ్స్ కట్టడికి కృషి చేస్తామని చెప్పారు. డ్రగ్ కేసుల్లో పట్టుబడి పోలీసు రికార్డుల్లో పేరు నమోదైతే భవి ష్యత్తులో ఉద్యోగాలు పొందలేరని, పాస్‌పోర్ట్, వీసాలు రావని తెలిపారు. ఎవరైనా డ్రగ్ అడిక్షన్ నుండి బయట పడాలంటే పోలీస్ శాఖ నుండి సహాయం చేస్తామని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, అమ్మ కాలపై సమాచారం తెలిపిన వరికి తగిన నగదు బహుమతి ఇస్తామని, సమాచారాన్ని స్థానిక పోలీసులకు



మాట్లాడుతున్న కలెక్టర్ శివ శంకర్, ఎస్పీ రవి శంకర్ రెడ్డి

లేదా డయల్ 112కు లేదా డయల్ 100కు తెలపాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల తలెత్తె దుష్పరిణామాలపై ప్రిన్సిపల్ శ్రీనివాస్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవికాంత్, ఎస్ఇబి ఎఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారి వి.శ్రీనివాస్, డీఎస్పీ కెవి మహేష్, రూరల్ సిఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐలు, ఎఇఎస్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో గుండె ఆపరేషన్లు పున:ప్రారంభం

ఒకరికి విజయవంతంగా ఓపెన్ హార్ట్ సర్జరీ చేసిన డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో దాదాపు రెండేళ్ల తర్వాత గుండె ఆపరేషన్లు సోమవారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఒకరికి ఓపెన్ హార్ట్ సర్జరీని విజయవంతంగా చేసినట్లు ప్రముఖ గుండె మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే తెలిపారు. సూపరింటెండెంట్ ఛాంబర్‌లో సోమవారం డాక్టర్ ప్రభావతితో కలిసి ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. కోవిడ్ వల్ల గుండె శస్త్ర చికిత్సలు ఆగిపోయాయని, దీనివల్ల బాధితులు అనేక అవస్థలు పడుతున్న అంశాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో మళ్లీ అనుమతి లభించిందని చెప్పారు. రాబోయే ఆరు నెలలు ఏడాది లోగా ఎక్కువ సంఖ్యలో శస్త్ర చికిత్సలు చేసేలా ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. గతంలో సహృదయ ట్రస్ట్ ద్వారా శస్త్ర చికిత్సలు చేసామని, ఈసారి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో చేస్తామని చెప్పారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ చంద్రకుమార్, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ ం ా వ ు ం ా జు పా ల్గొ న్నా ర ని తె లి పా రు. న ూ ప రి ం టె ం డె ం ట్ మాట్లాడుతూ నగరానికి చెందిన ఒకరికి బైపాస్ సర్జరీ విజయ వంతంగా చేసిన డాక్టర్ గోఖలే బృం దానికి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. సమావేశంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



ఆపరేషన్ పూర్తయిన తరువాత రోగినిపరిశీలిస్తున్న డాక్టర్ గోఖలే, సూపరింటెండెంట్ ప్రభావతి

ఖరీఫ్ సాగుకు ఆచితూచి

(మొదటి పేజీ తరువాయి)

మండలాల్లో బాగా తక్కువగా వర్షం కురిసింది. మాచర్లలో అత్యల్పంగా 10.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడం గమనార్హం. పల్నాడులో ఇంకా వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదు. బోర్ల కింద సాగు అవుతున్న భూముల్లో ముందస్తు ఖరీఫ్ ప్రారంభమైంది. మిగతా ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. వర్షాలు ఒక మోస్తరు నుంచి భారీగా కురిసిన ప్రాంతాల్లోనే సాగుపనులు ప్రారంభం అవుతున్నాయి. డెల్టాలో నారుమళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. మేడికొండూరు, ఫిరంగిపురం తదితర ప్రాంతాల్లో పత్తి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రకాశం బ్యారేజి నుంచి డెల్టా కాలువలకు సాగు నీటిని ఈనెల 7వ తేదీన నీటిని విడుదల చేసినా ఇంతవరకు పూర్తిస్థాయిలో కాల్వలకు నీరు రావడంలేదు. పశ్చిమ డెల్టాకు 100 క్యూసెక్కులే విడుదల చేస్తున్నారు. డెల్టాలో వరి నారుమళ్లకు ఇంకా నెల పాటు గడువు ఉందని రైతులు చెబుతున్నారు. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజికి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గుంటూరు ఛానల్, సాగర్ కాల్వలకు కూడా నీటి విడుదల ప్రారంభం కాలేదు. వర్షాలు పూర్తిస్థాయిలో కురిసిన తరువాత ఎగువ నుంచి వచ్చే వరద నీటి ప్రవాహాన్ని బట్టి కాల్వలకు నీటి విడుదల ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

కేంద్ర, రాష్ట్రం కలిసి భారాల బాదుడు

(మొదటి పేజీ తరువాయి)

వాడిన విద్యుత్‌కు ఇప్పుడు ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమన్నారు. నీటి ద్వారా తయారయ్యే, సోలార్ విద్యుత్ చవగ్గా వచ్చే అవకాశం ఉన్నా ఆదాని, అంబానీ సంస్థలకు లాభాలు దోచిపెట్టడానికి బొగ్గు ఆధారిత విద్యుత్‌ను అధిక ధరలకు కొంటున్నారని విమర్శించారు. శ్లాబ్‌లను కుదించడం ద్వారా యూనిట్లు తగ్గించి రేట్లు పెంచారన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించడం ద్వారా ప్రధాన సమయాల్లో అధిక ఛార్జీల వసూళ్లకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ నెల 30న స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి బస్టాండ్ వద్ద గల విద్యుత్ కార్యాలయల వరకు ర్యాలీ, ధర్నాలో అందరూ పాల్గొనాలని కోరారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అడప మోహన్ మాదిగ మాట్లాడుతూ గతంలో రూ.200 బిల్లు వస్తే ఇప్పుడు రూ.415 వస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే ఇది మరింత పెరుగుతుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉన్నవారికే 200 యూనిట్ల రాయితీని ఇస్తున్నారని, జగనన్న కాలనీలో ఉండే ఎస్సీ, ఎస్టీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజారమేష్ మాట్లాడుతూ ఒక్క బల్బు ఒక్క ఫ్యాను ఉన్న ఇంటికి రూ.2 వేల బిల్లు వచ్చిందంటే ఈ ప్రభుత్వాన్ని ఏమనాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆర్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఛండీఘర్‌లో రూ.7 వేలకు, రాజస్థాన్‌లో రూ.8 వేలకు స్మార్ట్ మీటర్ బిగిస్తుంటే మన రాష్ట్రంలో రూ.36 వేలుకు బిగిస్తున్నారని అన్నారు. బడ్జెట్‌లో మూడోవంతు విద్యుత్ ఛార్జీల రూపంలో వసూలు చేస్తున్నారన్నారు. ఐద్వా నియోజకవర్గ కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ సామాన్యులకు విద్యుత్ అంటేనే షాక్ కొడుతుందన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి సుబ్బాయమ్మ మాట్లాడుతూ విద్యుత్ పోరాటాల్లో మహిళలూ కలిసి రావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీల కంటే లై అప్ ఛార్జీలు అనడం బాగుంటుందని ఎద్దేవ చేశారు. ఈ నాలుగేళ్లలో రూ.57 వేల కోట్ల విద్యుత్ భారాలు వేశారన్నారు. సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు షేక్ సుభాని, ఉంజా ముత్తయ్య, డా.లక్ష్మణ్, సంగీతరావు, ఇ.అంజిరెడ్డి, ఎం.విల్సన్, ఎస్.బాబు, బి.కోట నాయక్ పాల్గొన్నారు.

వినుకొండలో అఖిలపక్షం ధర్నా, ప్రదర్శన

ప్రజాశక్తి - వినుకొండ : విద్యుత్ ఛార్జీలు, అధిక పన్నులకు వ్యతిరేకంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్తూపం సెంటర్లో ధర్నా చేపట్టారు. వైసిపి పాలనలో 8సార్లు కరెంటు ఛార్జీలు పెంచి రూ.వేల కోట్లు ప్రజల జేబులకు చిల్లులు పెట్టారని అన్నారు. పథకాల



పేరుతో రూ.100 ఇచ్చి పన్నులు, ఛార్జీల రూపంలో రూ.వెయ్యి వసూలు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రంఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, నాయకులు మదార్‌వలి, నాసర్ బి, రంజాన్‌బి, టిడిపి పట్టణ అధ్యక్షులు పి.అయూబ్‌ఖాన్, పి.దాసయ్య, రైతు నాయకులు పి.నాగేశ్వరరావు, జనసేన నాయకులు ఎన్.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్‌కె.నాయుడు, సిపిఐ నాయకులు పి.లాల్‌ఖాన్, బి.సాగర్, పి.వెంకటేశ్వర్లు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు సీతయ్య, ఫిరోజ్, దళిత నాయకులు పి.విజయ్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ.. బిల్లుల దహనం

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని ఈ నెల 30వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ల ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కృష్ణనగర్ సిఐటియు కార్యాలయంలో సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలను దొంగచాటుగా వేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను దొంగదెబ్బ తీసిందని విమర్శించారు. అసలు కంటే కొసరు అన్నట్లు విద్యుత్ వినియోగ ఛార్జీల కంటే సర్ ఛార్జీలు అధికంగా వస్తున్నాయని మండిపడ్డారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 30న జరిగే ధర్నా కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జొన్నా శివశంకరరావు, బి.వెంకటేశ్వర్లు, బి.దుర్గారావు, తులసమ్మ, ఎం.దుర్గారావు పాల్గొన్నారు. పెనుమాకలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీల బిల్లులను దహనం చేశారు. సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం.రవి మాట్లాడారు. బిజెపి పాలిత రాష్ట్రాలు వ్యతిరేకిస్తుంటే వైసిపి మాత్రం దూకుడుగా అమలు చేస్తోందన్నారు. ఈ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎస్‌కె పీరూసాహెబ్, సాంబయ్య, మస్తాన్, మరియదాసు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

మరమ్మతుల దృష్ట్యా గుంటూరులో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మారుతీనగర్, తుపాన్ నగర్, భాగ్య నగర్, నాయిబ్రాహ్మణ కాలనీ, మహా ప్రస్తానం రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. అలాగే బ్రాడిపేట, లక్ష్మీపురంలో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

జిఎంసి ప్లానింగ్ కార్యదర్శులకు ట్యాబ్‌లు

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో రీసర్వే వేగవంతంకు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లు అందించిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ప్లానింగ్ కార్యదర్శులకు ఆయా ట్యాబ్‌లను అందించారు. జగనన్న భూ హక్కు-భూ రక్షలో భాగంగా చేపట్టిన రీసర్వేలో గుంటూరు నగరంలో ఇప్పటికే 86 శాతం సర్వే పూర్తయిందని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల ద్వారా నగరంలో నూరు శాతం సర్వే వేగంగా చేపట్టడానికి వీలు కల్గుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసిపిలు అజయ్ కుమార్, బాబురావు, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తెనాలి

మంచినీటి సరఫరా లో అంతరాయానికి ప్రజల సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. హెడ్ వాటర్ వర్క్స్ మరమ్మతులు కారణంగా మంగళవారం నుంచి ఈ నెల 30 వరకు ఉదయం పూట మాత్రమే రక్షిత మంచినీటి సరఫరా ఉంటుందని తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలన్నారు

లక్ష్యాలు అధిగమించకుంటే చర్యలు

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు విద్య, వైద్య ఆరోగ్య, మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించ టంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు.సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి విద్యాశాఖ, వైద్యారోగ్యశాఖ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో జెవికె కిట్లు పంపిణీ ప్రక్రియ వెంటనే సక్రమంగా పూర్తి చేయాలన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలలో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, కిచెన్ షెడ్లు నిర్మాణం ఇతర మరమ్మత్తు పనులు జూన్ 30 నాటికి పూర్తి అయ్యేలా ఎంఈవోలు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ ఫీడ్ బ్యాక్ నిర్దేశిత సమయంలో ఖచ్చితంగా ఎఎన్ఎంలు అప్‌లోడ్ చేసేలా వైద్యాధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎన్సీడీ సర్వే వెంటనే పూర్తి అయ్యేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యామిలీ డాక్టరు విధానం కార్యక్రమంలో నిర్దేశించిన విధంగా బీపీ, షుగర్ వ్యాధిగస్తులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణీలు, బలహీనంగా ఉన్న పిల్లలు అంగన్వాడీ కేంద్రాల్లో క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకునేలా సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డిఇఒ పి.శైలజ, డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ ఎ.శ్రావణబాబు, ఐసీడీఎస్ పీడీ మనోరంజని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్

ఫొటోగ్రాఫర్ శంకరరావుకు మేయర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు



అమెరికన్ ఇమేజ్ కొలిగీ సొసైటీ (ఏ.ఐ.సి.యస్) వారు దామచర్ల శంకరరావుకి ఉత్తమ ఫోటోగ్రాఫర్‌గా ప్రశంసా పత్రం అందజేయటం అభినందనీయమని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. సోమవారం ఏ.ఐ.సి.యస్ అవార్డు అందించిన సందర్భంగా వారు మేయర్‌ను సంపత్ నగర్‌లోని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ శంకరరావును సన్మానించారు. మేయర్ మాట్లాడుతూ దేశంలోని అరకు, పాడేరు, ఒరిస్సా ప్రాంతాలలో కొండలపై జీవనం సాగించే బొండా తెగల గిరిజనులపై చాయా చిత్రాలు తీసి వారి జీవన శైలిని ప్రపంచానికి తెలిసేలా చేసినందుకు శంకరరావుకు ఏ.ఐ.సి.యస్ వారు ప్రశంసాపత్రం అందచేశారన్నారు. శంకరరావు గుంటూరు ఫోటోగ్రాఫిక్ అండ్ ఎలైడ్ ట్రేడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పాట్వా)లో ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ, అసోసియేషన్ సభ్యులకు ఫోటోగ్రఫిలో కొత్త టెక్నాలజీ పై అవగాహన కల్పించేందుకు తనవంతు కషిచేస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన కొద్దిమందిలో శంకరరావుకి అమెరికన్ పురస్కారం లభించుట సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో 57డివిజన్ వై.యస్.ఆర్.సిపి ప్రేసిఎంట్ నూర్, ఫోటోగ్రాఫిక్ అండ్ ఎలైడ్ ట్రేడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పాట్వా) ప్రెసిడెంట్ సంకా శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ ఎ.యం షరీఫ్ తదితరులుపాల్గొన్నారు.

59 మంది బాలికలకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని తాడేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి ఆధ్వర్యంలో 9,10,వతరగతి చదువుతున్న 59 మంది బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొని బాలికలకు సైకిళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ తాడేపల్లి వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినంద ్నీయమని కొనియాడారు. మెల్లంపూడి, కుంచన పల్లి, కొలనకొండ,వడ్డేశ్వరం,ఇప్పటం ప్రాంతాల నుండి వచ్చే బాలికలకు సైకిళ్లు అందజేయటం ఆనందంగా ఉందన్నారు. తాడేపల్లి రోటరీ క్లబ్ లో ఉన్న సభ్యులు, కొద్దిమంది దాతల సహాయ సహకారాలతో అందచేయడం గొప్ప విషయమని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి మాట్లాడుతూ ఒక్కో సైకిల్ విలువ రూ.6,000 ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, సభ్యులు కిరణ్ పరుచూరి,చంద్ర ఓబులారెడ్డి,ఉండేల సుకుమార్ రెడ్డి, రెడ్డి, బత్తులకళ్ళం రాజ శేఖర్ రెడ్డి, అమెరిశెట్టి వెంకటేశ్వర రావు,తాడేపల్లి తహశీల్దార్ ఎం.నాగిరెడ్డి, సిఐ శేషగిరిరావు, డి.ఈ కృష్ణారెడ్డి, బి.వేణుగోపాలస్వామి రెడ్డి,ఎంఇఒ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు మండల పరిధిలోని పేరేచర్ల గ్రామ శివారులోని జగనన్న ప్లాట్ల వద్ద ఈనెల 13 న వ్యక్తి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు మేడికొండూరు సిఐ వాసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఐ కె వాసు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి వడ్డవల్లి ,శాలివాహన నగర్ కు చెందిన మందా సైదేశ్వర రావు (33) అతని సమీప బంధువులైన నలుగురు వ్యక్తులు కలిసి ముందస్తు పథకం ప్రకారమే వేట కొడవళ్లతో హత్య చేసినట్లు ఆయన వివరించారు. హత్య చేసిన వారిలో గుంటూరు నగరం తురకపాలెం రోడ్ లోని భాగ్యనగర్ కాలనీకి చెందిన యేమ సుధాకర్, గుంటూరు నగరం స్తంభాలగరువు, కృష్ణదేవరాయ నగర్ కాలనీకి చెందిన పఠాన్ సుభాని, గుంటూరు జిల్లా చేబ్రోలు ఉప్పర పాలానికి చెందిన జూటూరు వెంకటరావు లను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వివరించారు. మరో ముద్దాయి గుంటూరు శ్రీ కృష్ణదేవరాయ నగర్ రైలు కట్టకు చెందిన ఏసుబాబు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులు పథకం ప్రకారం తమ దగ్గర ఉన్న వేట కొడవళ్లతో మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామ శివారులోని జగనన్న ప్లాట్స్ వద్దకు ఆటో బాడుగ ఉందని సైదేశ్వరావును తీసుకువచ్చి ఈ నలుగురు హత్య చేసినట్లు సిఐ వాసు తెలిపారు. హత్య చేసిన నలుగురిలో ముగ్గురిని అదుపులో తీసుకున్నట్లు ఒకరు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.



ముస్తాఫా రోజుకో నాటకం : నశీర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తన ప్రతిష్ట దిగజారి ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ఎమ్మెల్యే ముస్తాఫా రోజుకు ఒక నాటకం ఆడుతున్నారని తూర్పు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నశీర్ అహ్మద్ ఆరోపించారు. ముస్తాఫాతో పాటు, నగర పాలకసంస్థ గుంటూరు అభివృద్ధి గురించి పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద టిడిపి నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. ఎటువంటి అభివృద్ధి లేక ప్రజలు అనేక సమస్యలతో అల్లాడుతుంటే ప్రజలకు తగిన సమాధానం చెప్పలేక అధికారులపై ఆరోపణలు చేస్తూ కొత్త ఎత్తుగడను ఎంచుకున్నారని ఆరోపించారు. ముస్తాఫా ఒక అవినీతి అనకొండ అని, ప్రతి కాంట్రాక్టరు వద్ద రూ.6శాతం కమిషన్ డిమాండ్ చేసి కాంట్రాక్టర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. తన అనుయాయులకు, కుటుంబ సభ్యుల పేర్లతో కాంట్రాక్టు తీసుకొని నాసిరకం పనులు చేసాడని నశీర్ విమర్శించారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ ఏర్పడిన తరువాత అధికారపక్షంలో వాటాల పంపాకాల్లో గొడవలు ఏర్పడ్డాయన్నారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో దిగువ అంతస్తులో మెట్లపై కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం అదనపు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టిడిపినగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, టిడిపి నాయకులు చిట్టిబాబు, వేములకొండ శ్రీనివాస్, కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టను దిగజార్చేందుకు అధికారుల కుట్ర : ఎమ్మెల్యే ముస్తఫా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



సుద్ధపల్లి డొంకలో మురుగునీటి పారుదల పనుల పరిశీలిస్తున్న ముస్తాఫా

అధికారులు తాను ప్రతిపాదించిన పనులను చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నారని ఎమ్మెల్యే మహ్మద్ ముస్తాఫా ఆరోపిం చారు. గుంటూరులోని 10,11 డివిజన్లలో యుజిడి పైపులైన్ల ద్వారా మురుగునీరు వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయన సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తనను అప్రతిష్ట పాల్జేందుకు కుట్రపన్నారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక ప్రజలు యూజీడి పైప్ లైన్ ద్వారా రోడ్ల మీదకు వ్యర్థాలు వస్తున్నాయని దీని ద్వారా జ్వరాలు,మలేరియా అనేక రకమైన రోగాలు వస్తున్నాయని వర్షాకాలం సమీపించడంలో రోడ్ల మీద మురుగు నీరు చేరి దోమలు పేరుకుపోతున్నాయని ఆ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే ముస్తాఫాకు స్థానికులు ఫిర్యాదు చేశారు. 10 వ డివిజన్ స్టేడియం వెనక జున్ను సైదా నగర్, అలీ నగర్ 12 డివిజన్ అహ్మద్ నగర్ సయ్యద్ ఖాన్ స్ట్రీట్ 11 వ వార్డు సుద్దపల్లి డొంక మెయిన్ రోడ్లలో ఆయన పర్యటించారు. 10, 11డివిజన్ల మధ్య మెయిన్ రోడ్డు క్రైస్తవుల స్మశాన వాటిక సుద్దపల్లి డొంక యుజిడి పైప్ లైన్లు (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్లైన్లు) అస్తవ్యస్తంగా ఉన్నాయని, పది మీటర్ల యు జి డి పైప్ లైన్లు బ్లాక్ చేశారని, ఆయనే స్వయంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్ మూతల్ని ఓపెన్ చేసి అధికారులకు చూపారు. అయితేఅధికారులు సరిచేస్తామని చెప్పారు. తూర్పు నియోజకవర్గం వైసిపి నాయకురాలు షేక్ నూరి ఫాతిమా,నగరపాలక సంస్థఎస్ఈ భాస్కరరావు, ఈఈ కోటేశ్వరరావు, డిఈ కల్యాణరావు తదితరులుపాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు సతీష్‌కు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-మంగళగిరి :, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి 22-23 రోటరీ సంవత్సరానికి గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో జరిగిన అవార్డ్స్ నైట్ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు త్రిపురమల్లు సతీష్ బాబుకి అవార్డ్స్ ప్రదానం చేశారు. ఈ సంవత్సరంలో కాలంలో చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి వివిధ అంశాలలో 20 అవార్డులను మంగళగిరి క్లబ్ కైవసం చేసుకుంది. ఎన్ని కార్యక్రమాలు చేసినా రోటరీ సభ్యుల సమిష్టి సహకారంతోనే ఇది సాధ్యపడిందని సతీష్ బాబు అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ట్రైనర్ యిసునూరు అనిల్ చక్రవర్తి, కోశాధికారి గాజుల శ్రీనివాసరావు, క్లబ్ సెక్రటరీ అందే మురళి పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	38,882
మిర్చి ఎగుమతి	:	36,599
మిర్చి నిల్వ	:	14,641

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 23,000
నెం.5	10,500 - 22,000
273	11,000 - 22,500
341	10,000 - 22,000
సూపర్ 10	20,000 - 22,000
నాన్ ఎసి	
తేజ	9,500 - 24,200
బడిగి	10,000 - 25,000
దేవనూరు డీలక్స్	10,500 - 19,000
తాలుకాయలు	5,000 -14,000
ఎసి	
334	9,500 - 22,000
నెం.5	9,500 - 23,000
341	16,000 - 23,000
సూపర్ 10	19,500 - 19,500
తేజ	13,500 - 24,200
బడిగి	20,500 - 25,000
తాలుకాయలు	7,000 -13,500

ఆర్థిక వివాదాలపై ఫిర్యాదుల వెల్లువ




ఫణిదం పిహెచ్‌సిని సందర్శించిన డాక్టర్ పాదిల ప్రసాద్

ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి తోడ్పాటు

డాక్టర్ పాదిల ప్రసాద్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని ప్రముఖ ప్రవాస భారతీయ వైద్యులు డాక్టర్ పాదిల ప్రసాద్ అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. పిహెచ్‌సిలో రోగులకు అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవలు,వ్యాధి నిర్ధారణ పరీక్షలు గురించి ఆరా తీశారు. అవసరమైన సదుపాయాల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి అభివృద్ధికి తోడ్పాటు అందించ డానికి తానెప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పాదిల ప్రసాద్‌ను వైద్యులు సత్క రించారు. కార్యక్రమంలో ఫణిదం వైద్యాధికారి డాక్టర్ శ్రీలక్ష్మి కవిత, పార్మాసిస్టు సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు

'దళితులపై పెరిగిన దాడులు'

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

రాష్ట్రంలో దళిత వర్గాలపై దాడులను బహుజనులు ఐక్యంగా ప్రతిఘటించాలని వివిధ రాజకీయ పార్టీ నేతలు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలు సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ న్యాయవాది దాసరి జ్ఞాన్ రాజ్‌పాల్, జై భీం భారత్‌పార్టీ నాయకులు జె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. తాడికొండ మండలం కంతేరులో చెత్త ట్రాక్టర్ డ్రైవర్‌కు దళితులు వత్తాసు నిలబడినందుకు జీర్ణించుకోలేని అని స్థానిక నాయకులు భౌతిక దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులను అన్నీ విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ కన్వీనర్ కె.దేవానందం, మాలమహానాడు నాయకులు జి.ఆశీర్వాదం, కె.జాన్‌బాబు, పిసిసి కార్యదర్శి ఎం.వేదాద్రి, ఎస్.మోహన్‌రావు, జె.పాల్‌రాజ్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

సంచుల తయారీకి షార్ట్ టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్ : వైయస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ పోషకాహార కిట్లను వచ్చే నెల 15 నుండి లబ్ధిదారుల ఇంటికి పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో నరసరావుపేట, పల్నాడు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా కోసం అవసరమైన సంచులను తయారు చేయడానికి షార్ట్ టెండర్లు తెరవబడుతున్నాయని జె.శ్యాం ప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం ఈ నెల 30 లోగా నరసరావుపేట పట్టణం బరంపేటలోని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో లేదా 9491051603 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు కరస్పాండెంట్

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగన్నన్నకు చెబుదాం'లో ప్రజల నుండి ఫిర్యాదులను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి స్వీకరించారు. వివాహ సమయంలో తన పసుపు కుంకుమ కింద తాతయ్య ఇచ్చిన అరెకరం పొలాన్ని ఐదు నెలల క్రితం తాతయ్యే అమ్మారని, ఆ డబ్బులో కొంత మొత్తాన్ని ఇవ్వకుండా తిడుతున్నారని వినుకొండకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. స్నేహితునికి మూడేళ్ల కిందట రూ.3 లక్షలు అప్పుగా ఇప్పించానని, స్నేహితుడు రెండేళ్ల క్రిత చనిపోగా వాటిని తానే చెల్లిస్తానని చెప్పానని, అయితే అప్పు ఇచ్చిన వ్యక్తి డబ్బుకోసం ఒత్తిడి చేస్తున్నారని, తాను ఇంట్లో లేని సమయంలో తన భార్యను తిట్టి కొట్టారని ఫిర్యాదు చేశారు. ఇలా కుటుంబ, ఆస్తి వివాదాలు, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా రాగా వాటి పరిష్కారం కోసం అధికారులను ఎస్పీ ఆదేశించారు. అర్జీదార్లకు నరసరావుపేట పట్టణానికి చెందిన శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం అధ్యక్షులు, కోటప్పకొండ ట్రస్ట్‌బోర్డు సభ్యులు కొత్తూరి వెంకటశివ వేణుగోపాలరావు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఎస్పీతోపాటు అన్నదాన ఆర్గనైజర్ బి.వెంకట సత్యనారా యణ వడ్డించారు. ఎఆర్ అదనపు ఎసీప డి.రామచంద్ర రాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్‌కె చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి.మహేష్, పి.రాజు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నా ఇంటినే ఆక్రమించి.. నాపై కేసు



మండల కేంద్రమైన అచ్చంపేటలోని ఒక ఇంటిని సత్తెనపల్లి కోర్టు జప్తు చేస్తూ 2019లో వేసిన బహిరంగ వేలంలో రూ.10 లక్షలు, కోర్టు ఖర్చులు, రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించి సొంతం చేసుకున్న ఇంటిలోకి సదరు ఇంటి యజమాని గుండా వెంకయ్య, లక్ష్మీ దంపతులు వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని, వృద్ధుడినని కూడా చూడకుండా తనపై అత్యాచారం కేసు పెట్టారని గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన విన్నకోట మదన్ మోహన్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గతంలో కోర్టును ఆశ్రయించగా పోలీసులు వచ్చారని, వెంకయ్య దంపతులను బయటకు పంపి తాను ఉండేందుకు అవకాశం ఇచ్చారని చెప్పారు. అయితే కొన్ని రోజులకు అనారోగ్యంతో తాడేపల్లికి చికిత్స కోసం వెళ్లగా వారు ఇంటిని మళ్లీ అక్రమించారని, దీనిపై పోలీసులను, కోర్టును ఆశ్రయించినా న్యాయం జరగలేదని చెప్పారు.

ప్రేమ పేరుతో మోసం చేశాడని ఫిర్యాదు



ప్రేమిస్తున్నానని వెంటపడిన యువకుడు కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి అత్యాచారం చేశాడని, ఇప్పుడు బెదిరింపులకు పాల్పడుతున్నాడని యడ్లపాడు మండలం ఉన్నవకు చెందిన యువతి ఫిర్యాదు చేశారు. నగ్న ఫొటోలు ఉన్నాయంటూ బెదిరించి ఇప్పటికే పలుమార్లు అత్యాచారం చేశాడని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు మరో యువతితో వివాహానికి సిద్ధపడ్డాడని చెప్పారు. దీనిపై తండ్రీకొడుకులను నిలదీయగా చంపుతామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు.

ఆస్తి కోసం బిడ్డలే వేధిస్తున్నారు

కానిస్టేబుల్ తనపై అత్యాచారానికి పాల్పడగా న్యాయం కోసం కోర్టును ఆశ్రయించానని, పరిహారంగా 1.10 ఎకరాల భూమిని కోర్టు ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన పొలం ప్రస్తుతం ధర పెరగడంతో దాన్ని అమ్మి ఆ డబ్బు తమకివ్వాలంటూ కొడుకులు, కోడళ్లు ఒత్తిడి చేస్తున్నారని రెంటచింతలకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. పొలం అమ్మడానికి తాను నిరాకరించడంతో దాడి చేశారని, పోలీసులను ఆశ్రయిం చినా కొడుకుల వైపు మాట్లాడుతున్నారని తెలిపారు.

నేను లేకుండా పొలంలో తవ్వకం



ఉద్యోగ రీత్యా పూణేలో స్థిరపడిన కుమారుడు దగ్గరికి వెళ్లిన సమయంలో నరసరావుపేట మండలం గురవాయపాలెంలో సర్వే నం.278/8లో తన 37 సెంట్ల పొలంలో 7 అడుగుల మేర మట్టిని తవ్వారని గ్రామానికి చెందిన మండలపు శివపార్వతి ఫిర్యాదు చేశారు. మట్టి తవ్వకం వల్ల సాగుకు పనికిరాని విధంగా పొలం తయారైందని, మట్టిని అమ్మిన గుడిపూడి చిన్నకోటయ్య, కొనుగోలు చేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

అప్పు తీసుకుని దాడి



డబ్బు అత్యవసరంగా అవసరమని, వారంలో తిరిగిస్తానని రూ.20 వేలను తమ సమీప బంధువు పత్రా విజయ్‌కుమార్ తీసుకుని తిరిగివ్వలేదని దాచేపల్లికి చెందిన పత్రా సత్యవేదం ఫిర్యాదు చేశారు. డబ్బులిచ్చిన నెల తర్వాత అడిగితే అతని కుటుంబీకులు దూషించి దాడి చేశారని, గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం దాచేపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఫిర్యాదు చేశారు.

అన్న నుండి ప్రాణహాని



వారసత్వంగా వచ్చిన ఆస్తిలో తన వాటపై కన్నేసిన పెద్ద అన్నయ్య తనను బెదిరించడంతోపాటు చంపేందుకు కుట్రలు పన్నుతున్నాడని ఈపూరు మండలం అగ్నిగుండాలకు చెందిన పెద్ద ఇమామ్‌పై వినుకొండ పట్టణం పెద్ద మసీదు ప్రాంతానికి చెందిన చిన్న ఇమామ్ ఫిర్యాదు చేశారు. తన అన్నకు నేర చరిత్ర ఉందని, అతని నుండి తమకు ప్రాణహాని ఉన్నట్లు ఈపూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగలేదని చెప్పారు. తన అన్నతో పాటు అబ్దుల్లా, జుబేర్, పీరయ్య, కాశమ్మ, చిన్న ఇర్ఫాన్,ఆయేషాల నుండి ప్రాణహాని ఉందని తెలిపారు.

మధ్యవర్తిగా ఉన్నందుకు వేధింపులు



యడ్లపాడుకు చెందిన హర్షవర్ధన్ సింగ్ కారును యడ్లపాడు మండలంలోని కారసాలకు చెందిన తాడిపత్రి సాయిరెడ్డికి తాను మధ్యవర్తిగా ఉండి అద్దెకు ఇప్పించానని, లావాదేవీలను వారిద్దరే చూసుకున్నారని, అయితే ఆ కారును సాయిరెడ్డి తనఖా పెట్టడంతో యజమాని హర్షవర్ధన్ సింగ్ తనపై వేధింపులకు పాల్పడుతున్నాడని న్యాయం చేయాలని చిలకలూరిపేటకు చెందిన మధు ఫిర్యాదు చేశారు.

పొలం కబ్జాకు యత్నం



శావల్యాపురం మండలం కొత్తలూరులో డి.నం.17/3లో 1.77 ఎకరాలను ఆమనిగంటి వెంకటేశ్వర్లు, 81/బి3 లో 3.50 ఎకరాలను చిందుకూరి వెంకయ్య కబ్జా చేశారని, నకిలీ పత్రాలు సృష్టించి కాజేయాలని చూస్తున్నారని ఈపూరు మండలం కొచ్చెర్ల ఉప్పరపాలేనికి చెందిన బేతంచర్ల వెంకాయమ్మ ఫిర్యాదు చేశారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఇళ్ల మధ్యన వాటర్ ట్యాంక్ నిర్మించొద్దని వినతి

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి పరిధిలోని దిడుగు ఎస్సీ కాలనీలో జనావాసాల మధ్య వాటర్ ట్యాంక్ నిర్మించొద్దని తహశీల్దార్ విజయశ్రీకి గ్రామస్తులు సోమవారం విన్నవించారు. సుమారు 40 ఏళ్ల క్రితం కాలనీ ఏర్పడగా అప్పటి ప్రభుత్వం పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, కళ్యాణ మండపం, ప్రార్ధన మందిరాలు కోసం 25 సెంట్లు ఖాళీ స్థలాన్ని కేటాయించిందని, అందులో వాటర్ ట్యాంక్ కట్టాలని గ్రామ పంచాయతీ అధికారులు పనులు మొదలు పెట్టారని చెప్పారు. ఆ స్థలంలో అంగన్వాడి కేంద్రంతోపాటు ఓ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించేందుకు అనుమతులు కావాలని కోరారు.



పుస్తకాల గదిని సీజ్ చేస్తున్న అధికారి, పక్కన ఎస్ఎఫ్ఐ నాయకులు

నారాయణలో పుస్తకాల గది సీజ్

ఎస్ఎఫ్ఐ ఫిర్యాదుతో స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్

పట్టణంలో నారాయణ విద్యాసంస్థల్లో పుస్తకాలు అధిక రేట్లు అమ్ముతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులకు అందిన సమాచారం మేరకు సోమవారం అక్కడికి చేరుకొని జిల్లా విద్యా శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో పాఠశాలను పరిశీలించిన అధికారులు.. పుస్తకాల గదిని సీజ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కోట సాయికుమార్, ఎస్.రాజు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ ముద్రించిన పుస్తకాలు కాకుండా వారు ముద్రించిన పుస్తకాలు ఎక్కువ ధరకు అమ్ముతున్నారని చెప్పారు. దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యల్లేవన్నారు. ఇప్పటికైనా స్పందించి సీజ్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు నవిత, రమా, అమూల్య, జిల్లా కమిటీ సభ్యులు జ్యోతిష్, సిద్ధు, రాఘవ పాల్గొన్నారు.

రోడ్డున పడేటట్టు చేయొద్దు



దాసరి మాధురి

తమకు రాజధానిలో స్థలం ఇచ్చి రోడ్డున పడేటట్లు చేయొద్దు. మేం అక్కడ ఇళ్లు కట్టుకోలేం. మేం ఉంటున్న స్థలానికి ఇంటికి రెగ్యులరైజేషన్ చేసి పట్టా లివ్వాలి.

అడవిలో పడేస్తారా



నారిన శాంతకుమారి

ఎక్కడో దూరంగా తీసుకెళ్లి అడవిలో పడేస్తారా. దీనికి అంగీకరించం. 35 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. విజయ వాడ దగ్గరగా ఉంది. పనులు జరుగుతున్నాయి. ఇక్కడ నుంచి కదిలే ప్రసక్తే లేదు.

పట్టా వచ్చిందంటే వెళ్లాం



వల్లభనేని అన్నపూర్ణ

అమరావతి బస్సులో తీసుకెళ్లే సందర్భంగా ఇంటికి పట్టా వచ్చిందంటే వెళ్లాం. తీరా అక్కడకు వెళ్లిన తరువాత అక్కడున్న సెంటు స్థలం వచ్చిందని, పట్టా ఇస్తున్నామని చెప్పారు. సెంటు స్థలంలో ఇల్లు నిర్మించుకోలేం. కొద్దోగొప్పో సంపాదించి గూడు నిర్మించు కున్నాం. అ ఇంటికే పట్టా ఇవ్వండి.

మోసం చేస్తున్నారు : కీర్తన



ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మమ్మల్ని మోసం చేస్తూనే ఉన్నారు. ఒకరు అధికారంలో ఉంటే మరొకరు రక్షణగా ఉంటామని చెబు తారు. అధికారం తారుమారు పోయిన ప్పుడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ ఇదే మాట చెబుతుంది. ఇలా 40 ఏళ్ల నుంచి మోసం చేస్తూనే ఉన్నారు. చావైనా రేవైనా ఇక్కడే ఉంటా. ఇప్పుడుంటున్న స్థలానికి పట్టా ఇవ్వా ల్సిందే.

ఉన్న ఇంటికే ఎసరు పెడితే ఊరుకోం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

ప్రజాశక్తి-తాడేపల్లి

పేదలు నివశిస్తున్న ఉన్న ఇంటికి, స్థలానికి ఎసరు పెడితే చూస్తు ఊరుకునేదిలేదని, బాధితులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సుందరయ్య నగర్, కృష్ణవేణి నగర్‌లలో గత 40 సంవత్సరాలుగా నివశిస్తున్న పేదలకు అక్కడే పట్టాలిచ్చి రెగ్యులరైజేషన్ చేయాలని సోమవారం స్థానిక సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టె కరుణాకరరావు అధ్యక్షత వహించారు. పెద్దఎత్తున తరలివచ్చిన బాధితులను ఉద్దేశించి బాబూరావు మాట్లాడుతూ రాజధానిలో పేదలకు ఇచ్చిన స్థలానికి గ్యారెంటీ లేదన్నారు. ఈ విషయాన్ని పట్టాలో పొందుపరిచారని, కోర్టు తీర్పులకు లోబడి ఇచ్చిన పట్టాలపై హక్కు ఉంటుందని అందులో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రధాని మోడీ అర్హులైన వారందరికీ ఇళ్లని చెప్పడం, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం 30 లక్షల మందికి ఇళ్లపట్టాలని చెప్పడం అంతా మోసమేనన్నారు. లేని వాళ్లకు స్థలాలిచ్చి పట్టాలివ్వడం సమంజసమని, ఏళ్ల తరబడి నివాసముంటున్న వారికి ఆస్థలాలకే పట్టాలిచ్చి రెగ్యులరైజేషన్ చేయడం ధర్మమని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రస్తుతం ఎక్కడ ఉంటున్న వారికి అక్కడే పట్టాలిస్తామని గత ఎన్నికలకు ముందు స్థానిక ఎమ్మెల్యే హామీనిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న టిడిపి ఈసారి తమ ప్రభుత్వం వస్తే, మంగళగిరిలో లోకేష్ గెలిస్తే ఇప్పుడున్న వారికి అక్కడే పట్టాలిచ్చి రెగ్యులరైజేషన్ చేస్తామని చెబుతున్నారని చెప్పారు. 40 ఏళ్ల నుంచి నివాసముంటున్న వారికి ఎవరూ పట్టాలివ్వదన్నారని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇటువంటి మోసపూరితమైన వాగ్దానాలను నమ్మి మోసపోవద్దన్నారు. రాజధానిలో స్థలం అంటే మన వేళ్లతో మన కళ్లతో పాటు అమరావతి రైతుల కళ్లు కూడా పొడుస్తున్నారన్నారు. అద్దెలకు ఉన్న వారికి స్థలాలివ్వడం సమంజసమని, అలాగే పట్టాలివ్వడం మంచిదేనని చెప్పారు. ఇక్కడ నివశిస్తున్న వారికి మాత్రం ఇక్కడున్న స్థలానికి మాత్రమే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వం కొత్తగా సురక్ష యోజన పథకం తీసుకొచ్చిందని, ఇక్కడున్న వారికి మాత్రం రక్ష పథకం తీసుకోవాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ సుందరయ్యనగర్, కృష్ణవేణినగర్ ప్రాంతాల్లో పట్టాలిస్తామని రూ.30 వేలు వసూలు చేసే కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలన్నారు. అసలు ఉంటాయో ఊడుతాయో తెలియని స్థలాలకు డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. ఇక్కడున్న ప్రజలందరికీ ఇక్కడే పట్టాలివ్వాలని ఎక్కడికీ వెళ్లేది లేదన్నారు. ఉన్న ఊరిని ఖాళీ చేయించి ప్రజలను త్రిశంకు స్వర్గంలో ముంచుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడున్న స్థలాలను రెగ్యులరైజేషన్ చేయాలని ఏళ్ల తరబడి పోరాడుతున్నా పాలకులు స్పందించడంలేదన్నారు. రాజధానిలో స్థలాలిచ్చి పేదలకు, రైతులకు తగువు పెట్టవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాలకుల మాటలకు మోసపోవద్దని అన్నారు. ప్రధాని అందరికీ ఇళ్లు, జగన్ నవరత్నాలు అంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పొమ్మనకుండా పొగబెట్టే విధానాలను పాలకులు అవలంభిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఐద్వా నాయకురాలు కె.ఉషారాణి, సిఐటియు నాయకులు నారిన నాగేశ్వరరావు, సిపిఎం పట్టణ నాయకులు కొట్టె కరుణాకరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.గడ్డన్న, ఎస్.జగన్, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, పి.గిరిజ, ఎస్.ముత్యాలరావు, బి.గోపాల్‌రెడ్డి, వై.బర్నబస్, డివి భాస్కరరెడ్డి, బి.రామారావు, పి.రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిహెచ్ బాబురావు

రాజధాని రైతులకు వేగంగా కౌలు చెల్లింపు

సిఆర్‌డిఎ కమిషనర్ కె.నరసింహం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లింపుకు చర్యలు వేగవంతం చేయాలని సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ కట్టా నరసింహం డిప్యూటీ కలెక్టర్ లను ఆదేశించారు. సోమవారం ఆయన తుళ్లూరు సి ఆర్ డి ఎ కార్యాలయంలో ప్రత్యేక కలెక్టర్ (భూ వ్యవహారాలు)టి చిరంజీవితో కలిసి కాంపిటెంట్ అధికారులతో సమావేశమయ్యారు. కోర్టు కేసుల్లో లేని రైతుల భూముల వివరాలను సేకరించాలని, కౌలు చెల్లింపునకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కేసు విచారణ పరిధిలో లేని అసైన్డ్ రైతుల వివరాలను కూడా సిద్ధం చేయాలన్నారు. నాలుగు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు 20,870 మంది రైతులకు సంబంధించిన 24,149 ఎకరాలకు రూ156.24 కోట్లు కౌలు చెల్లింపు నిమిత్తం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయన్నారు. అయితే వీటిలో 16,395 మంది రైతులకి మాత్రమే రూ 120.56 కోట్లు కౌలు చెల్లించేందుకు సిఎఫ్‌ఎంఎస్ చర్యలు తీసుకోవడం జరిగిందని శనివారం సి ఆర్ డి ఎ కమిషనర్ వివేక్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మిగిలిన రైతులకు కౌలు చెల్లింపు వ్యవహారం రాజధాని గ్రామాల్లో చర్చనీయాంశమైంది.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కెఎస్ లక్ష్మణరావు

శారదా నికేతన్‌కు వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి-గుంటూరు

లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు, పట్టాభిపురం వారు ఎన్‌ఆర్ఐ శాఖమూరి సత్యనారాయణ, రాజేశ్వరి దంపతుల సహకారంతో బ్రాడీపేటలోని శారదానికేతన్ స్కూల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు ప్రారంభించారు. స్కూల్ పిల్లలకు ఉపయోగపడే వాటర్ ప్లాంట్‌ను సుమారు రూ.50వేలతో ఏర్పాటు చేసినట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ దానిలో భాగంగా వాటర్ ప్లాంట్‌ను స్కూల్ పిల్లలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేయడంతో పాటు, అనేక సేవా కార్యక్రమాలు మెడికల్ క్యాంప్‌లు, వయోవద్ధులకు దుస్తులు, వంట సామాగ్రి పంపిణీ కార్యక్రమాలు చేయడంలో ముందుంటారని లయన్స్ క్లబ్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్‌గా నియమితులైన నిడమనూరి సురేష్‌ని లక్ష్మణరావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్ నూతలపాటి వీరప్రకాశరావు, జిల్లా ఇన్చార్జ్ గవర్నర్ పి. గోపీచంద్, డిప్యూటీ డి.ఇ.ఓ వెంకటేశ్వర్లు, ఉర్దూ డిఐ ఖాసిం, హెచ్ఎం ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు ప్రాంతాన్ని డీఫారెస్టు చేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో ఫారెస్టు ప్రాంతంలో నివశిస్తున్న వేలాది మందికి ఆ ప్రాంతాన్ని డీఫారెస్టు చేసి నివశిస్తున్న చోటే పట్టాలివ్వాలని, ఆస్థలాలను రెగ్యులరైజేషన్ చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణంలోని తెల్ల క్వారీ సచివాలయం వద్ద 11, 12 వార్డులకు సంబంధించి పెద్దఎత్తున తరలివచ్చిన పేదలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ రెక్కాడితేగానీ డొక్కాడని ఈ ప్రాంత పేదలను తీసుకెళ్లి మరోచోట పెట్టడమంటే వారిని నిలువునా మోసం చేయడమేనన్నారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎక్కడున్న వారికి అక్కడే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న పేదల జీవితాలను మరో చోటకు తరలించి వారిని ఇబ్బందుల పాలు చేయొద్దని ప్రభుత్వాని విజ్ఞప్తి చేశారు. పట్టణాలకు దూరంగా ఎక్కడో 20 కిలోమీటర్ల దూరం తీసుకెళ్లి ఇళ్లస్థలాలు ఇస్తే ముందు వారి జీవన విధానం దెబ్బతింటుందని చెప్పారు. కేంద్రం ఇచ్చే రూ.1.80 లక్షలతో ఇళ్ల నిర్మాణం సాధ్యం కాదన్నారు. సిపిఎం సీనియర్ నాయకలు జొన్నా శివశంకరరావు, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మట్లాడుతూ గత ఎన్నికలకు ముందు స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే హామీ మేరకు ఫారెస్టు భూములను డీఫారెస్టు చేసి రెగ్యులరైజేషన్ చేసి పట్టాలివ్వాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ రాయభార కార్యక్రమంలో ఎ.శౌరిబర్తులం, యేషయ్య, తులసమ్మ, ఎస్‌కె హసీనా, ఎం.మల్లేశ్వరి, నాగమణి, వేణు, బి.వెంకన్న, వి.శాస్త్రి, ఎన్.దుర్గారావు, వెంకటలక్ష్మి, జానీ, శారద, రమ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాశం రామారావు

వార్డు సెక్రెటరీలకు అంతర్ జిల్లాల బదిలీలు

ప్రజాశక్తి-గుంటూరు

వార్డు సచివాయాల్లో పనిచేస్తున్న అడ్మిన్, వెల్ఫేర్ డేటా ప్రాసెసింగ్ అండ్ ఎడ్యుకేషన్, శానిటేషన్, ప్లానింగ్, ఎమినిటీ కార్యదర్శులకు సోమవారం స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పౌస్, మ్యుచ్‌వల్, జిల్లా పరిధిలో అదర్స్ కేటగిరిలో అంశాల ప్రాధ్యాన్యతగా బదిలీలు జరిగాయని తెలిపారు. బదిలీలకు జోన్ పరిధిలో ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పౌస్ 38, ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యూచ్ వల్ 70, అదర్స్ విభాగంలో 210 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిఎంసి డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి. హెచ్. శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఆర్‌డి శ్రీనివాసరావు తదితరులు

విజ్ఞాన్స్ ఎన్‌సిసి క్యాడెట్లకు 'బి' సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు :విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 30 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు గుంటూరులోని 10 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్‌కు చెందిన హవల్దార్ తేజేంద్రకుమార్, సుబేదార్ గురువిందర్ సింగ్‌లు సోమవారం 'బీ' సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ రాతపరీక్ష, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరైన 30 మంది విద్యార్థులు 10శాతం ఉత్తీర్ణతతో సర్టిఫికెట్స్ సాధించారని పేర్కొన్నారు.. అనంతరం విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు వడ్లమూడి గ్రామములో 'టేక్ ఏ స్టాండ్- బీ డ్రగ్ ఫ్రీ" అనే నినాదంతో మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత మత్తును ఆస్వాదించేందుకు బానిసలు కాకూడదన్నారు. వాటి వాడకం వలన మెదడుపై మానసిక ఒత్తిడి, శరీరంలోని అంతర్గత అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. డ్రగ్స్ సేవించడం మొదలుపెడితే దాని నుంచి బయటపడటం అంత సులువు కాదన్నారు. ఎన్‌సీసీ 'బీ' సర్టిఫికెట్స్‌ను సాధించిన విద్యార్థులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.





ఆర్‌విఆర్‌లో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా సోమవారం కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ రూపొందించిన బ్యానర్లను, ప్లకార్డులను ప్రదర్శిస్తూ, కళాశాలో కూడలిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - దాచేపల్లి

క్రీడలతో శారీరక ధృఢత్వం, మానసికోల్లాసం కలుగుతాయని గురజాల శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో కెవిఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆటలు ఆడటం అలవాటు చేసుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా ఉంటామని అన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-ఈపూరు

మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులకు రుచికరంగా అందించాలని ఎంఇఒ-2 రామ తులసి అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు కస్తూరి బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, వంట వారికి పలు సూచనలు చేశారు. అనంతరం హాజరు రికార్డు లను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఆమెతోపాటు ప్రిన్సిపాల్ పి.జ్యోతి ఉన్నారు.

ముస్లిం పెద్దలతో సిఐ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి

బక్రీద్ పండుగను పురస్కరించుకొని మండలంలోని ముస్లిం మత పెద్దలతో అమరావతి సిఐ ఎవి బ్రహ్మం సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి సూచించారు. గోవధ నిషేధం, పండుగ రోజు మసీదులో ప్రార్థనలు నిర్వహించుకుని, శాంతియుతంగా బక్రీద్ పండగ జరుపు కోవాలని సూచించారు.

కౌలు రైతులు సిసిఆర్‌సి తీసుకోవాలి

ప్రజాశక్తి-నకరికల్లు

కౌలు రైతులు సిసిఆర్‌సి కార్డు పొందాలంటే రైతు భరోసా సిబ్బందిని గాని, గ్రామ రెవెన్యూ అధికారి గాని కలవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.దేవదాసు తెలిపారు. పట్టాదారు పాస్ బుక్ నకలు, ఆధార్ కార్డు నకలు తీసుకొని రైతు భరోసా కేంద్ర సిబ్బంది సంప్రదించి తీసుకోవాలని సూచించారు.

జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిలకలూరిపేట

మండల పరిధిలోని వేలూరులో కిడ్నీ పాడవడం కారణంగా మరణించిన దేగల సాగర్ కుటుంబాన్ని జ్ఞానేశ్వర ఫౌండేషన్ అధినేత జాన్ సైదా సోమవారం పరామర్శించారు. సాగర్ స్వగృహానికి వెళ్లిన ఆయన, వారి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఖరీఫ్ సాగుకు రైతులను సన్నద్ధం చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. పంటల సాగుపై ప్రభుత్వానికి కనీసం ప్రణాళిక కూడా లేదన్నారు. స్థానిక పండరీ పురంలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రాలతో ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని, రైతులకు అవసరమయ్యే విత్తన రకాలను ఆర్బీకేల ద్వారా సరఫరా చేయాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు.

29న శ్రీ రామలింగేశ్వర స్వామి తిరునాళ్ల

కొండపై ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - వినుకొండ

ఈ నెల 29వ తేదీన శ్రీ రామలింగేశ్వర స్వామి తిరునాళ్లను ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకర్ రెడ్డి సోమవారం వినుకొండలోని కొండపై జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కొండపై ఉన్న దేవాలయం, అఖండ జ్యోతి ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ రామలింగేశ్వర స్వామి తిరు నాళ్ళకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా, తొక్కిసలాటలు జరగకుండా, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల వారు సమిష్టిగా పనిచేసి ఈ తొలి ఏకాదశి తిరునాళ్ళ విజయవంతానికి కృషి చేస్తామని అన్నారు. పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి, వాహనదారులకు పార్కింగ్



కొండపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

గురించి అవగాహన కల్పించాలని పోలీస్ అధికారు లకు సూచించారు. ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తినప్పుడు దానిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు.. పోలీసులకు, అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కిన మల్లికార్జునరావు, కౌన్సిలర్ షకీలా, చిన్నబ్బాయి తైతలు పాల్గొన్నారు.

పొరపాట్లను దిద్దుకునేందుకు 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందని, పథకాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు లేక కొందరి లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు దూరమవుతున్నాయని ఆ పొరపాట్లను దిద్దుకునేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కిన మల్లికార్జునరావులు కోరారు. బ్రహ్మనాయుడు కళ్యాణ మండపంలో జగనన్న సురక్ష కార్యక్రమం పై ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, రథ సారథులు వైసీపీ నాయకులకు అవగాహన సదస్సు నిర్వ హించారు. జూలై 1 నుండి క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అద్వాన డ్రైనేజీకి మరమ్మతులు

ప్రజాశక్తి-కారెంపూడి

మండల కేంద్రమైన కారెంపూడి లోని బస్టాండ్ సెంటర్లో ఉన్న డ్రైనేజీ సమస్యను ఎట్టకేలకు అధికారులు సోమవారం శ్రీకారం చుట్టారు పట్టణంలోని వివిధ వీధుల్లో నుండి మురుగునీరు బస్టాండ్ సెంటర్లో నిల్వ చేరడంతో గ్రామపంచాయతీ అధికారులు ఆర్ అండ్ బి అధికారులు డ్రైనేజీని ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా డ్రైనేజీ సమస్య పూర్తిస్థాయిలో చేపడుతున్నట్లు ఆర్ అండ్బి డి ఈ మురళీకష్ణ, పంచాయతి ఈవో కసిన్య నాయక్ తెలిపారు.డ్రైనేజీ సమస్యలు లేకుండా పూర్తిస్థాయిలో మురికి కాలువలను బాగు చేసే పనులు చేపడతామని కార్యదర్శి తెలిపారు.

ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని ఏనుగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వీటంరాజు పల్లి గ్రామంలో ఎల్‌సిడిసి కార్యక్రమానికి ఎంపీపీ పగడాల జయశ్రీ హాజరై ఇంటింటి సర్వే ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లెప్రసి.. మైకో బ్యాక్టీరియం లెప్ట్రి అను సూక్ష్మ క్రిమి ద్వారా వస్తుందని,ఈ వ్యాధి చర్మం, నరాలకు కళ్ళకి సోకుతుందని చెప్పారు.వాలంటీర్స్ ఆశా వర్కర్స్ ఈనెల 26 నుండి వచ్చేనెల 16 వరకు ఎల్‌సిడిసిసర్వేలు ప్రతి ఇంటిలోని సభ్యులను పరీక్ష చేసి అనుమానిత కేసులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారితో పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఎమ్ఓ ప్రభాకర్ రెడ్డి, సిహెచ్ఓ నాగేశ్వరమ్మ హెచ్ ఈ ఓ. వి. నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతపై నిరంతరం నిఘా

రెవిన్యూ అధికారులను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా కరస్పాండెంట్

భారత ఎన్నికల సంఘం పల్నాడు జిల్లాకు కేటాయించిన ఈవిఎం, వివిపాడ్ లను భద్రపరచే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం చేపట్టింది. నరసరావుపేట పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు చెందిన 7వ నంబరు గోదామును కేటాయించారు. బెంగళూరు బెల్ కంపెనీ నుంచి వచ్చిన 5920 వివి పాడ్‌లను కలెక్టర్, రెవిన్యూ, రాజకీయ ప్రతినిధుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గోదాములో భద్రపరిచారు. అంతకు ముందు గోదాము వద్దకు కలెక్టర్ చేరుకొని పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ పాటు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి శేషిరెడ్డి, తహశీల్దార్ రమణా నాయక్, కలెక్టరేట్ ఎస్.ఓ యశోద, వైసిపి ప్రతినిధి ఖాన్, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, బహుజన సమాజ్ పార్టీ బాబురావు తదితరులు పాల్గొన్నారు



ఈవీఎంలను భద్రపరుస్తుండడాన్ని రెవిన్యూ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

గ్రామస్థాయి నుంచే క్రీడలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-అచ్చంపేట

గ్రామస్థాయి నుంచి క్రీడలకు సముచిత ప్రోత్సాహం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అచ్చంపేట మండలం రోకటిగుంటవారిపాలెంలో మెరుపు సీసీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలకు సోమవారం బహుమతి ప్రదానం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రీడలను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ఆటల పండుగ నిర్వహించబోతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దు

వినుకొండ: నవజీవన్ బాలభవన్ విజయవాడ వారి సహకారంతో, స్థానిక ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మత్తుపదార్థాల వినియోగ వ్యతిరేక దినోత్సవంను నిర్వహించారు.ముందుగా వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు , కౌన్సిలర్ షకీలా సంయుక్తంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. బ్రహ్మనాయుడు మాట్లాడుతూ యువత ఈ మత్తుపదార్థాలకు ఎక్కువగా బానిసలై తమ తల్లిదండ్రుల ఆశలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. షకీలా మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, తమ బంగారు భవిష్యత్తును మంచిగా నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఆ తరువాత పట్టణంలో పెద్ద ఎత్తున యువతతో ర్యాలీ,ప్రతిజ్ఞల ద్వారా ప్రజలను ఆలోచించేలా అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తుపదార్థాలు, మానవ అక్రమ రవాణా మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి , కౌన్సిలర్లు, హ్యాండ్స్ ఆఫ్ కాంపాషన్ వినుకొండ ప్రతినిధి విద్యారావ్ తదితరులు పాల్గొన్నారు.**సత్తెనపల్లి రూరల్:** మాదక ద్రవ్యాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సత్తెనపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎం.భుజంగరావు విద్యార్థులకు సూచించారు. సెబ్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలోని విద్యాకేంద్రం డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. **అమరావతి:**అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పల్లోటి కళాశాలలో పోలీస్ అధి కారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సిఐ బ్రహ్మం నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ భాస్కరరావు, ప్రిన్సిపల్ కృష్ణమోహన్ పాల్గొన్నారు. **యడ్లపాడు:** మండలంలోని తిమ్మాపురం సచివాలయంలో 'డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు' అనే నినాదంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్స్ స్కీం ప్రాజెక్టు డిఆర్‌పి ఎం.వాసుదేవరావు మాట్లాడుతూ యువతీ , యువకులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తల్లి దండ్రులు వారి పిల్లలపై శ్రద్ధ పెట్టాలని, వారు ఎలాంటి అలవాట్లు, ఆలోచనలు కలిగి ఉంటున్నారో గమనిం చాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతి సెక్రటరీ పి. వెంకటేశ్వర్లు , ఎఎన్ఎం ఎం.నాగలక్ష్మి , జోనల్ సూపర్‌వైజర్ బి.నాగేశ్వరరావు , లింకు వర్కర్ ఎన్. ఆదిలక్ష్మి , ఆశ కార్యకర్తలు లక్ష్మి , ఆశ పాల్గొన్నారు.**దాచేపల్లి:** దాచేపల్లిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ముత్తేలంపాడు రోడ్డు టర్నింగ్ వద్దకు చేరుకొని అక్కడ మానవ హారంగా ఏర్పడ్డారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వ హించారు. కార్య క్రమంలో దాచేపల్లి ఎస్సై శివ నాగరాజు, సంధ్యా రాణి పాల్గొన్నారు. **కారెంపూడి:** మాదక ద్రవ్యాల వాడకానికి యువత దూరంగా ఉండాలని సి ఐ దార్ల జయకుమార్,జడ్పీటీసీ షేక్ షఫీ,ఎస్ ఐ ఎం రామాంజనేయులు అన్నారు. స్థానిక జెడ్ పి పి హెచ్ పాఠశాల నందు మాదక ద్రవ్యాల వాడక నిషేధ వారోత్సవాల లో భాగంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ రఘుబాబు,ఏ ఎస్ ఐ శేఖర్,పాఠశాల విద్య కమిటీ చైర్మన్ ఆతుకూరి గోపి,వెసిపి నాయకుడు కె.కాశీ పాల్గొన్నారు. **మాచర్ల :** పట్టణంలో విద్యార్థులతో కలిసి పట్టణ పోలీసులు, ఎస్.ఇ.బి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ సిఐ బాలక్రిష్ణ మాట్లాడారు. ర్యాలీలో ఎస్.ఇ.బి సిఐ ప్రసాదరెడ్డి , విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **నాదెండ్ల:** విజయవాడ స్వచ్ఛంద సంస్థ నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో స్థానిక స్వచ్ఛంద సంస్థ హాండ్స్ ఆఫ్ కంపోజిషన్ సహకారంతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భావన్ కోఆర్డినేటర్ జి.అనిల్ పాల్గొన్నారు. **రెంటచింతల:** మండల కేంద్రమైన రెంటచింతలలో సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వాటి వల్ల కలిగే దుష్పరి నామాలను సోదా హరణంగా వివరించారు. ఎస్ఐ షామీర్ బాషా, కరస్పాండెంట్, ఫాదర్ పాపయ్య, హెచ్ఎం శ్రీనివాసరావు, ఎఎస్ఐ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



వినుకొండలోని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో..



సత్తెనపల్లిలోని విద్యాకేంద్రం డిగ్రీ కళాశాలలో ..

30న మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

రైతాంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 30వ తేదీన విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను జయ ప్రదం చేయాలని స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ ధర్నాకు రైతులు కౌలు రైతులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోస్టర్‌ను ఆవిష్కరించిన వారిలో జెట్టి బాలరాజు ఎన్ యోగేశ్వర రావు వై బ్రహ్మేశ్వర రావు బి అమ్మిరెడ్డి తదితరులున్నారు.

ప్రజాశక్తి-తెనాలి

ఈ నెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. రూరల్ గ్రామాలైన



రైతులతో మాట్లాడుతున్న సాంబిరెడ్డి

గుడివాడ, కొలకలూరు, ఎరుకలపూడి గ్రామాల్లో సోమవారం సమా వేశాలు నిర్వహించి, రైతులు, కౌలు రైతులతో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డు లివ్వాలని, ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చర్యలు తీసకోవాలని కోరారు. ఈ సందర్భంగా రైతులకు సాగు నీరందించేందుకు పెద వడ్లపూడి ఎత్తిపోతల పథకాన్ని ప్రారం భించాలన్నారు. కేంద్రప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో ఎరువులకు రూ.35 వేల కోట్లు తగ్గించడం ద్వారా ఖరీఫ్‌లో ఎరువుల ధరలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది ఖరీఫ్, రబీలో పంట నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడి, పంటల బీమా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎం.సాంబశివరావు, జె. కోటేశ్వరావు, బి.సుధాకర్, కె.గగారిన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడికొండ

ఈనెల 30వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కంచుమాటి అజయ్ కుమార్ బృందం తాడికొండ మండలంలోని మోతాడక,నిడుముక్కల గ్రామాలలో ప్రచారం నిర్వహించి గోడప్రతులను,కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అజయ్



దుగ్గిరాలలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు రైతు సంఘం నాయకులు వద్ద వాపోయారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సిహెచ్ భాస్కరరావు, బాణావతి భద్రయ్య మనవ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



తాడికొండ మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు



నేడు ఆటో,ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా వర్క్‌షాపు

ప్రజాశక్తి-పెదకాకాని

సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం శంకర కంటి ఆస్పటల్ ఆటో కార్మికుల సమావేశం కేసాని గోపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు పాత గుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆటో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా వర్క్ షాపు జరుగుతుందని చెప్పారు. ఈ వర్క్ షాప్‌కు ఆల్ ఇండియా రోడ్ ట్రాన్సపోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పాల్గొంటారని అన్నారు. మోటార్ వాహనాల డ్రైవర్ల సమస్యలపై చర్చిస్తారని, జిల్లాలో ఆటో,లారీ ట్రాన్స్‌పోర్ట్, వివిధ వాహనాలకు సంబంధించిన యూనియన్ల బాధ్యులు అందరూ పాల్గొనాలని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ వాహనాల చట్టం సవరణ చేసి జీవో నెంబర్ 21 ద్వారా అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు భారీ మొత్తంలో పెంచారని, మొదలైన సమస్యలతో వారు బాధపడుతున్నారని, డ్రైవర్లకు ఎటువంటి భద్రతా లేదని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటోలకు పట్టణ,నగర ప్రాంతాల్లో స్టాండ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆటో యూనియన్ నాయకులు కె.కొండలు, లక్ష్మీనారాయణ ఏసుబాబు నరసింహారావు పాల్గొన్నారు.

మంగళగిరిని క్రీడాహబ్ గా తీర్చిదిద్దేందుకు కృషి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిని క్రీడాహబ్ గా తీర్చిదిద్దేందుకు కషి చేస్తు న్నామని, భవిష్యత్తులో మంగళగిరి కేంద్రంగా జాతీయ స్థాయిలో ఈత, స్కేటింగ్ పోటీలను నిర్వహించే విధంగా స్విమ్మింగ్ ఫూల్, స్కేటింగ్ రింక్ నిర్మాణాలను చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి తుదిదశకు చేరుకున్న పలు అభివృద్ధి నిర్మాణాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. తొలుత నగరంలో సుమారు కోటి రూపాయలతో నిర్మిస్తున్న సగర కమ్యూనిటీ హాలు నిర్మాణం పనులను, రూ.3 కోట్ల వ్యయంతో రాజీవ్ గృహకల్ప ఆవరణలో నిర్మించిన చేనేత మగ్గం షెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం రజక కమ్యూనిటీ హాలు నిర్మాణం పనులను పరిశీలించారు. అక్కడి నుంచి పాత బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న చేనేత బజారు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కె మాట్లాడుతూ తుది దశకు చేరుకున్న సగర, రజక కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి పదిపదిహేను రోజుల్లో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. ఇక యాదవ, క్రిస్టియన్, మైనారిటీలకు, ఎరుకుల, యానాదుల కులాల వారి సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు కూడా స్థల పరిశీలన కూడా పూర్తయినట్లు చెప్పారు. నాయీ బ్రాహ్మణ, బోయ కులాల వారికి



నిర్మాణపనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

కూడా వీలైనంత త్వరలోనే స్థలం పరిశీలన చేసి కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్క చేనేత కార్మికుడికి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు.

ఈత, స్కేటింగ్ పోటీలకు మంగళగిరి వేదిక కావాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవితో కలసి తుదిదశకు చేరుకున్న స్విమ్మింగ్ ఫూల్, స్కేటింగ్ రింక్ లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ షంషేర్ మహబూబ్ ఖాన్ పేరుతో స్విమ్మిం గ్ ఫూల్ ను అత్యాధునికంగా, పిల్లలకు బేబీ స్విమ్మింగ్ ఫూల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి ఈత, స్కేటింగ్ పోటీలకు మంగళగిరి వేదిక కానుందన్నారు. క్రీడాకారులకు మరింత ప్రోత్సాహాన్ని అందించి మంగళగిరిని క్రీడా హబ్‌గా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తు న్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లేశ్వరరావు, నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తులో జీవితాలను చిత్తు చేసుకోవద్దు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్: మత్తులో జీవితాలను చిత్తు చేసుకోవద్దంటూ గుంటూరు జిల్లా అదనపు ఎస్పి (సెబ్) డిఎన్.మహేష్ విద్యార్థులకు సూచించారు. వడ్డేశ్వరం లోని కెఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని సెంటర్ పర్ ఎక్స్ టెన్షన్ యాక్టివిటీస్, సాక్ ల అధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో వర్శిటీకి చెందిన విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ప్లకార్డులు పట్టుకుని మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యఅతిథిగా గుం టూరు స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో అదనపు ఎస్పి సబ్ డిఎన్.మహేష్,విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావులు మాట్లాడారు. కార్య క్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థ సారధివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ హనుమం తరావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎన్ఆర్ఐ కళాశాల్లో సోమవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వ హించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వి నియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ జి.మాలతి ఆదేశాల మేరకు నిర్వహించిన సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ ఉన్నత పాఠ శాల ఎన్‌సిసి విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారి సర్దార్ మాట్లాడారు.

మేడికొండూరు: మండలంలోని విసదల అడ్డ రోడ్డు వద్ద



గల ఎన్నారై టి ఇంజనీరింగ్ కళాశాలలో మాద క ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా యూత్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్. పల్లవి , మేడికొండూరు సిఐ కె. వాసు, జిల్లా చైల్డ్ ప్రొటక్షన్ అధికారి బి.వాసంతి హాజరై మాట్లాడారు. డ్రగ్స్ సమాచారం 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయడం ద్వారా నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు.

పొన్నూరు రూరల్: స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో వెంకటేశ్వర జూనియర్ కాలేజ్ విద్యార్థులు, సెబ్ అధికారులతో పాటు పొన్నూరు అర్బన్ పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు.

28న రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-తెనాలి

విద్యుత్ బిల్లుల మోతపై ఈనెల 28న స్థానిక చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిఐటియూ జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్ సోమవారం తెలిపారు. విద్యుత్ చార్జీల భారం-స్మార్ట్ మీటర్ల భారాన్ని నిరసిస్తూ జరిగే పౌరసమాజం, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్‌లో ప్రతిఒక్కరూ పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

వేతనాలు జమ చేసిన కమిషనర్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - మంగళగిరి

సిఆర్‌డిఎ నుండి ఎంటిఎంసిలో విలీనమైన కార్మికులకు మూడు నెలల పెండింగ్ జీతాలను సోమవారం నాడు కార్మికుల అకౌంట్లో జమ చేసిన ఎంటిఎంసి కమిషనర్ శారద దేవికి సిఐ టియు నాయకులు ఎం.రవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాచూరి వేణులు ధన్య వాదాలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బక్రీద్ సందర్భంగా గోవధ నిషేధం అమలు

ప్రజాశక్తి-తెనాలి

ఈనెల 29న బక్రీద్ సందర్భంగా అవులు, ఒంటెల వద నిషేదమని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు సోమవారం తెలిపారు. భారత అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ మార్గదర్శకాలను అనుసరించి ఆవులు, ఒంటెల వధ నిషేధం అమలౌతుందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను గౌరవించి, ప్రజలు పురపాలక సంఘానికి సహకరించాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పశు వైద్యశాల నిర్మాణం పూర్తిచేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరులో పశు వైద్యశాలను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సోమవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ చేనేత వికాస చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చిర్రావూరులో పశు వైద్యశాల నిర్మాణం చేపట్టి, పూర్తి చేయకుండా, గత పదమూడేళ్లుగా వదిలేశారని అన్నారు. తక్షణమే పశు వైద్యశాలను పూర్తిచేసి వైద్యుని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్షలో జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు ఎస్. నాగే శ్వరరావు, గ్రామ అధ్యక్షులు ఖాళీ కృష్ణ, లాల్ చంద్, పి.వేణు, శెట్టి రామ కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

సిరిపురంలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి - మేడికొండూరు

ఇచ్చిన మాట కట్టుబడి ఉండే నాయకుడు ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని సిరిపురంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమం అందేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని, ఎవరికైనా అందకుంటే వారికి అందేలా జగనన్న సురక్ష పథకం ప్రవేశ పెట్టారని చెప్పారు. అర్హులై ఉండి ఇంకా సంక్షేమాన్ని పొందని వారు ఉంటే వారి వివరాలు సేకరించి వారికి అందేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్న జడ్పిటిసి కందుల సిద్దయ్య పాల్గొన్నారు

విద్యుత్ అదనపు భారాలను రద్దు చేయాలి

లా నేస్తంను సద్వినియోగం చేసుకోండి

పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

పల్నాడు జిల్లాలో యువ న్యాయవాదులకు రూ.22.75 లక్షలు లబ్ధి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్



మెగా చెక్కు విడుదల చేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్

కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అర్హత గల యువ న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్టైఫండ్ ను సద్వినియోగం చేసుకుని వృత్తిలో పురోగతి సాధించా లని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. సోమవారం 2023-2024 సంవత్సరానికి మొదటి విడతగా రాష్ట్రంలోని 2,677 మందికి వైయస్సార్ లా నేస్తం స్టైఫండును రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోమవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి రూ . 6.12 కోట్లను ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి విడుదల చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ లోతేటి లోతేటి శివశంకర్ లబ్ధిదారులైన యువ న్యాయవాదులతో కలిసి వీక్షించారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ 2023-2024 సంవత్సరం మొదటి విడతగా ఫిబ్రవరి 2023 నుండి జూన్ 2023 వరకు 5 నెలలకు నెలకు రూ 5 వేలు చొప్పున జిల్లాలో 91 మందికి రూ 25 వేలు చొప్పున రూ 22.75 లక్షలు యువ న్యాయవాదుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. లా డిగ్రీ పూర్తి చేసి న్యాయవాది వృత్తిలోకి అడుగుపెట్టిన వారికి 3 ఏళ్ల వరకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైయస్సార్ లా నేస్తం పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని చెప్పారు. ఈ ఆర్థిక సహాయం నెలకు రూ 5వేలు చొప్పున ఏడాదికి రూ. 60 వేలు చొప్పున 3 ఏళ్లలో రూ.1.80 లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు.



మెగా చెక్కు అందచేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

గుంటూరు జిల్లాలో 234 మందికి లా నేస్తం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో 234 మంది జూనియర్ న్యాయవాదులకు లానేస్తం కింద రూ.70.20 లక్షలు అందచేసినట్లు జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. యువ న్యాయవాదులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రాక్టీస్ చేయటానికి, లా డిగ్రీ పూర్తి చేసి, న్యాయవృత్తిని ప్రారంభించిన వారికి తొలి మూడు సంతవ్సరాలు నెలకు రూ.5000 స్టైఫండ్ అందిస్తూ అండగా నిలిచినట్లు చెప్పారు. సోమవారం తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం వైయస్ జగన్ మోహన్‌రెడ్డి యువన్యాయవాదులకు 2023-24 సంవత్సరానికి మొదటి విడత లా నేస్తం నిధులను వర్చువల్‌గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ఎం .వేణుగోపాల్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, ముద్దాళి గరిధర్ రావు, కిలారి వెంకట రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్, నగర మేయర్ కావటి మనోహర నాయుడు, రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరి రావు, రాష్ట్ర కుమ్మరి శాలి వాహన కార్పొరేషన్ ఛైర్మన్ మండేపూడి పురోషోత్తం, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు సహాయ కార్పొరేషన్ ఛైర్మన్ ముంతాజ్ పఠాన్, జిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ రాతం శెట్టి సీతా రామాంజనేయులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

రెవెన్యూ అధికారులను ఆదేశించిన పల్నాడు జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జెసి ఎ శ్యాం ప్రసాద్

పల్నాడు జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ అతిథి గృహంలో సోమవారం రీ సర్వే పనులకు సంబంధించి నరసరావుపేట, గురజాల, మాచవరం, రెంటచింతల, నాదెండ్ల, చిలకలూరిపేట, నూజెండ్ల తదితర 9 మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రీ సర్వే పనులు జరుగుతున్న తీరును జిల్లా జాయింట్ కలెక్టర్ సంబంధిత రెవెన్యూ అధికారులను, ల్యాండ్ సర్వే, రికార్డుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం, అనుకున్న లక్ష్యం మేరకు ఈ సర్వే పనులను పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సమీక్ష సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు, నరసరావుపేట ఆర్డీవో శేషిరెడ్డి, మొబైల్ మెజిస్ట్రేట్ టీమ్, ఆయా మండలాల తహశీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందనకు 249 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు



అర్జీలు స్వీకరిస్తున్న జెసి, ఇతర అధికారులు

అధికారులు స్పందన పిటీషన్ల పరిష్కారంపై సరైన రీతిలో పరిశీలించి సక్రమంగా ఎండార్స్ మెంట్ పంపినట్లయితే పిటీషన్లు రీఓపెన్ అయ్యే ఆస్కారం లేదని జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జెసి రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనరాయణ శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. వెంకట శివరామిరెడ్డి , డిప్యూటీ కలెక్టర్లు మోవిడి వాణి, సాయిశ్రీ, గుంటూరు ఆర్డిఓ ప్రభాకర్ రెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 249 అర్జీలను స్వీకరించారు.కార్యక్రమంలో డీఆర్డీఏ, డ్వామా మెప్మా పీడీలు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, వెంకట నారాయణ, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, పంచాయతీ రాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య, జిల్లా పంచాయితీ అధికారి కేశవ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, డిఈఓ శైలజ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.





ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

ప్రభుత్వ కాలేజిల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం.బాలాజీ, యం.కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ నాయకులు, ఇంటర్ విద్యార్థులు సోమవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేసి, అనంతరం స్పందనలో అర్జీ అందచేశారు. గత సంవత్సరం వరకూ పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇచ్చారని, ఈ సంవత్సరం నుంచి ఇవ్వట్లేదని, మార్కెట్‌లో కొనుగోలు చేయాలని చెబుతున్నారన్నారు. దీని వల్ల పేద విద్యార్థులపై రూ.1500లు అదనపు భారం పడుతుందన్నారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయటానికి ఈ విధానం దోహదం చేస్తుందని విమర్శించారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, నగరంలోని కోడిగుడ్డు సత్రం హాస్టల్ భవనాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు అరికట్టాలని, విద్యా సంస్థల్లో పుస్తకాలు, యూనిఫామ్‌లు, బూట్లు, బెల్టులు, స్టేషనరీ విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. డిగ్రీ విద్యతో నాలుగేళ్ల విధానం ప్రవేశ పెడుతూ నిర్ణయం తీసుకోవటం వల్ల వారికి ఏమీ ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రోపాస్, సుచరిత, నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.పద్మ, ఎస్.కె.సమీర్, జిల్లా నాయకులు యశ్వంత్, భరత్, చంద్ పవన్, మున్నా, ఆరిఫా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదనపు భారాలు రద్దు చేయాలి

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అసమర్ధ విధానాల వల్ల విద్యుత్ భారాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారని, ప్రజలపై మోపుతున్న అదనపు విద్యుత్ భారాలు రద్దు చేయాలని గుంటూరు నగరంలోని వివిధ పౌర సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు.సోమవారం స్పందనలో అర్జీ అందచేశారు. 2014 నుండి 2019 వరకు వినియోగించుకున్న కరెంటుకు ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు భారాలు మోపటం అన్యాయం అన్నారు. అలాగే ప్రభుత్వ రంగ బొగ్గు గనులు అతి తక్కువ ధరకు బొగ్గు సరఫరా చేస్తుంటే, కేంద్రం ఆదేశాలతో విదేశీ బొగ్గును అధిక ధర చెల్లించి కొనుగోలు చేయడం వల్ల ప్రజలపై భారాలు పడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో అదనపు భారాలు మోపేందుకు పూనుకుందని విమర్శించారు. ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. స్మార్ట్ మీటర్ల కొనుగోలు ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలో విద్యుత్ ఉత్పత్తి చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫెడరేషన్ ఆఫ్ అపార్ట్మెంట్స్ అండ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఫాక్వా) కన్వీనర్ ఎల్.ఎస్.భారవి, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పౌర సంఘాల సమాఖ్య గుంటూరు నగర నాయకులు కె.నళినీకాంత్, ఓ.నారాయణరెడ్డి, సదాశివరావు, రామకష్ణ, సాయిరాం, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



రేటింగ్ సర్టిఫికెట్ చూపిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు


ఆర్‌విఆర్ అండ్ జెసికి 'ఎఎ' రేటింగ్

ప్రజాశక్తి-గుంటూరు :ఎన్‌పిటిఇఎల్, ఐఐటి మద్రాస్ వారు నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో తమ కళాశాల విద్యార్థులు చూపిన ప్రతిభకు ఏఏ రేటింగ్ సాధించటం తమ కళాశాలకు గర్వకారణం అని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. జనవరి, ఏప్రిల్‌లో ఐఐటి మద్రాసు నిర్వహించిన ఎన్‌పిటిఇఎల్ పరీక్షల్లో ఆర్‌విఆర్ అండ్ జెసి విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు కళాశాల జాతీయ స్థాయిలో ఏఏ రేటింగ్ పొందిందని, దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌లను ఇటీవల ఐఐటి మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కళాశాల పాలక మండలి సభ్యులు, ప్రిన్సిపాల్ అధ్యాపకులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఉన్న 5633 చాప్టర్స్‌లో తమ కళాశాల లోకల్ చాప్టర్ జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానిలవటం ఆనందదాయకం అని గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కాలేజి ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, డాక్టర్ యం.వి.పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు :జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, ఏ ఒక్క ఫిర్యాదు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన నిర్వహించారు. ఈ స్పందనలో వివిధ విభాగాలకు చెందిన 36 అర్జీలు అందాయి. వాటిని ఆయా విభాగాల అధికారులకు అందచేసి, వాటి పరిష్కారానికి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు చెప్పులు, సబ్బులు ఇవ్వాలి



మున్సిపల్ కార్మికులకు చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనెలు ఇవ్వాలని, పార్కులలో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు కోరారు. సోమవారం నగర కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలని ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదేశాలు ఉన్నాయని, ఇప్పటికీ గుంటూరు నగరపాలక సంస్థలో అమలు చేయట్లేదని తెలిపారు. అలాగే పార్కుల్లో పని చేస్తున్న కార్మికులకు రెయిన్ కోట్‌లు, బూట్లు వంటి రక్షణ పరికరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ స్టేడియంలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ పారిశుధ్య కార్మికులకు చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె ఇచ్చేందుకు ఫైల్ పెట్టాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల బకాయి హెల్త్ అలవెన్స్ చెల్లింపునకు బిల్లులను ఖజానా శాఖ వారికి పంపించామని తెలియజేశారు. పార్కుల్లో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ పరికరాలు ఇచ్చేందుకు, యన్టీఆర్ స్టేడియం సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫారం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.